ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025 | 5



మారేడుమిల్లిలో రోడ్డుపై కూలిన చెట్లు



గొల్లప్రోలు గాంధీనగర్‌లో ఈదురుగాలుల ధాటికి నేలకూలిన చెట్టు, తెగిన విద్యుత్ వైర్లు





పిఠాపురంలో భారీ వర్షం.. యు.కొత్తపల్లి మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం



ఈదురుగాలుల బీభత్సం

- 'ఉమ్మడి తూర్పు'లో భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు
- గ్రామాల్లో అంధకారం
- తడిచిపోయిన ధాన్యం

కాకినాడ/పిఠాపురం/గొల్లప్రోలు/కొత్తపల్లి/సామర్ల కోట-ఆంధ్రజ్యోతి): జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రికి పెనుగాలులు వీచాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కరెంటు స్తంభాలు సైతం కూలిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో అంధకారం అలుముకుంది. గాలుల తాకిడికి రహదారులపై ఇసుక, దుమ్ము సైతం లేచింది. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల తోపాటు ఏజెన్సీ ప్రాంతంలో కూడా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రి 9 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. హోరుగాలితో జనం హడలెత్తిపోయారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కొత్తపల్లి, ప్రత్తిపాడు మండలాల్లోను, కోనసీమ జిల్లాలోని అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, కె.గంగవరం తదితర చోట్ల, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోను భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి విద్యుత్‌స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. తోటల్లో మామిడికాయలు నేలరాలిపోయాయి. ధాన్యం రాశులు తడిచిపోయాయి. నువ్వులు, అపరాలు, ఇతర మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డులోను ఓ భారీ వృక్షం నేలకూలింది. రామారావుపేట పాము వారి వీధిలో కరెంటు తీగలపై చెట్టు పడింది. గొల్లప్రోలు-తాటిపర్తి, గొల్లప్రోలు-చెందుర్తి ఆర్‌అండ్‌బీ రోడ్లతోపాటు పలు ప్రధాన రహదారులపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. 50 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఊరిలోనే.. ఉపాధి!

- యువతకు వర్క్‌ఫ్రం హోం
- కూటమి ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్
- సాఫ్ట్‌వేర్‌పైనే ప్రధాన దృష్టి
- ఇంట్లోనే పనిచేసుకునేలా సౌకర్యాల కల్పన
- లేదంటే వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లొచ్చు
- ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు
- ఇప్పటికే పూర్తయిన సర్వే
- పని ఉన్నవారు వేలల్లో.. లేనివారు లక్షల్లో
- సర్వేలో విద్యార్హతలతో సహా తేలిన లెక్కలు
- ఇంటర్‌నెట్ కనెక్షన్ల వివరాలూ నిక్షిప్తం



సొంత ఊరిలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉద్యోగులకు, కంపెనీలకు ఉపయోగపడేలా ఇంటి నుంచే పని (వర్క్‌ఫ్రం హోం) సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం విధానం సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన కార్పొరేట్ సంస్థల్లో కొనసాగుతోంది. కొవిడ్-19 తర్వాత చాలా కంపెనీలు దీనిని కొనసాగిస్తున్నాయి. కంపెనీలకు ఈ విధానం సులభంగా ఉండడం, ఆర్థికంగా మేలు జరుగుతుండడంతో పనులు చేయించుకునేందుకు ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయి. తద్వారా ఎక్కువమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అనుగుణంగా వర్క్‌ఫ్రం హోంకు అనువైన కేంద్రాలను గుర్తించే పనులు చేపడుతున్నారు.

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలోనే యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్నాయి. అది కూడా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలతోపాటు, విదేశాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. చాలామంది అక్కడి వెళ్లిపోతున్నా.. కొంతమంది మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లో పనిచేసినా వచ్చే జీతంలో ఎక్కువ ఖర్చులకే అయిపోవడం, తల్లిదండ్రులు, కుటుంబాలకు దూరంగా ఉండాల్సి రావడంతో సొంతూరిలోనే ఏదొక వ్యాపారం, వ్యవసాయం, తమ చదువులకు తగ్గ చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఇంటి వద్దే ఉంటూ ఐటీ కంపెనీల్లో పనిచేయడానికి వీలున్న యువతను గుర్తించే పనులు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో యువతీయువకులు, అర్హతలు వంటివి సర్వే ద్వారా సేకరించారు.

అందరివీ 'ఐటీ' కలలే..

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఏ విభాగంలో విద్యను అభ్యసించారో కూడా వివరాలు సేకరించారు. అయితే ఈ సర్వేని బట్టి దాదాపుగా అందరూ సాఫ్ట్‌వేర్‌కే ప్రాధాన్యం ఎక్కువ ఇస్తున్నారు. దీంతో తొలుతగా ఆ రంగంలోనే ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా సాఫ్ట్‌వేర్ అభ్యసించిన వాళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయారు. కానీ ఐటీ రంగంలో ఆ స్థాయిలో ఉద్యోగ కల్పన లేదు. ఒకవేళ ఉన్నా సుదూర ప్రాంతాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సెక్టార్‌ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మరింత దుస్థితికి దారితీసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత సాఫ్ట్‌వేర్ చదువుకున్న అభ్యర్థుల కష్టాలను గుర్తించింది. కొందరికి వర్క్‌ఫ్రంహోం సదుపాయాన్ని కంపెనీ కల్పించినా ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేవు. అధిక శాతం మందికి అసలు ఉద్యోగాలే లేవు. స్వల్ప సంఖ్యాకులకు ఉద్యోగం ఉన్నా దూర ప్రాంతాల్లో అతి తక్కువ జీతాలతో నెట్టుకురావాల్సి వస్తోంది. దూర ప్రాంతాల్లో ఇబ్బందులు పడలేక ఉద్యోగం వదిలేసి సొంతూరికి వచ్చి ఏదొక పని చేసుకుంటున్నవాళ్లు ఉన్నారు. ఈ సమస్యలకు వర్క్‌ఫ్రం హోంతో చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ చదువరులకు వర్క్‌ఫ్రం హోం కష్టాలు తగ్గించడం, వారికి ఉద్యోగం లేకపోతే ఏదొక కంపెనీ తరఫున వర్క్‌ఫ్రం హోం సదుపాయం కల్పించడంపై కసరత్తు జరుగుతోంది. ఒక మండలంలో వివరాల ప్రకారం ఆయా ప్రదేశాల్లో ఒకచోట వర్క్‌ఫ్రం హోంకి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారు. అక్కడ కంప్యూటర్లు, వైఫై వంటి సదుపాయాలు ఉంటాయి. ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లి విధులు నిర్వహించుకోవచ్చు.



ఇవీ సర్వే గణాంకాలు

విద్యార్హతలు	తూర్పుగోదావరి	కాకినాడ	కోనసీమ
నిరక్షరాస్యులు	5,095	6,940	3,278
తొమ్మిదిలోపు చదువు	22,202	25,795	23,375
పదో తరగతి	32,791	38,581	39,142
ఇంటర్	36,428	47,094	45,168
డిప్లమో/ఇతరం	9,265	12,923	13,982
ఇంజనీరింగ్	18,600	22,606	23,863
కామర్స్ డిగ్రీ	8,966	9,550	9,663
ఆర్ట్స్ డిగ్రీ	8,718	10,787	10,193
డిగ్రీ ఇతర కోర్సులు	30,282	42,131	37,508
ఎంబీబీఎస్	247	302	239
బీఎల్	218	256	184
పీజీ	11,538	12,924	12,535
పీహెచ్‌డీ	194	227	258
ఇతరులు	4,944	5,991	7,311
ఉద్యోగం/ఉపాధి :			
పనిచేస్తున్నవారు	27,962	30,795	27,337
పనిచేయనివారు	1,61,493	2,05,345	2,01,573
మొత్తం :	1,89,455	2,36,140	2,28,910
బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ :			
ఉన్నవారు :	20,993	20,163	18,873
వైఫై ఫెసిలిటీ	11,511	15,034	12,153
అదనపు వైఫై సౌకర్యం	48,737	61,516	49,452

వర్క్‌ఫ్రం హోం సర్వే లక్ష్యం ఇదే

వర్క్‌ఫ్రం హోం ద్వారా పనిచేసేందుకు ముందుకు వచ్చే నిరుద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి కూటమి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంటర్నెట్, ఏసీ సదుపాయం ఉన్న భవనాలను గుర్తించే పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎంత మంది ఉన్నారు? ఉద్యోగాలు చేస్తున్నవారు ఏయే కంపెనీల్లో చేస్తున్నారు?, ఇంటి దగ్గరే ఉండి పనిచేస్తున్నారా?, ఆయా కంపెనీలకు వెళ్లి పనిచేస్తున్నారా? వర్క్‌ఫ్రం చేసేవారు ఎక్కడి నుంచి చేస్తున్నారు?, వారు పనిచేసే రూమ్ సైజ్ ఎంత?, ఆ రూమ్‌లో వేరొకరికి చోటు కల్పించే అవకాశం ఉందా?, ఇంటర్నెట్ సౌకర్యం ఉందా?, ఎంత స్పీడ్‌లో నెట్‌ను వినియోగిస్తున్నారు? వంటి వివరాలపై సర్వే నిర్వహించారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు విద్యార్హతలు ఉన్న వారెందరు? ఉద్యోగాలు చేస్తున్నారా? లేదా? చేయకపోతే కారణాలు?, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఎంత మందికి ఆసక్తి ఉంది? ఇలా వివరాలు సేకరించారు. వీరందరూ త్వరలోనే ఇంటి నుంచి పనిచేసుకునేలా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఎక్కడెక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇంటిపట్టునే ఉంటే.. ఉద్యోగం చేసుకునేలా ఉపాధి చూపనుంది. ఇప్పటికే ఆయా సంస్థల ప్రతినిధులతో కూటమి సర్కారు పెద్దలు సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది.



ఆకుకూరల ధరలు

పైపైకి

- మండుతున్న ధరలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

సామర్లకోట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభమైంది. ఎండలు చుర్రుమంటున్నాయి. అదే రీతిలో మార్కెట్లలో ఆకుకూరల ధరలు మండుతున్నాయి. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, జగ్గంపేట, తుని సహా సామర్లకోట పట్టణంలోని నెంబరు 2 మార్కెట్, సంత మార్కెట్ ప్రాంతాలలో తోటకూర, గోంగూర, బచ్చలి, కొత్తిమీర, కరివేపాకు, చుక్కకూర, పాలకూర పొన్నగంటి కూర, మెంతుకూర, పుదీనా వంటి ఆకుకూరల ధరలు పైపైకి చేరాయి. వేసవి కాలం ఇంకా మధ్యస్థ దశ ప్రారంభం కాకుండానే ఆకుకూరల ధరలు ఇలా పెరగడంవల్ల సామాన్యులే కాదు ధనికులు సైతం ఆకుకూరలు కొనాలంటే బెంబేలెత్తుతున్నారు. అత్యంత చౌకగా అధిక విటమిన్లు లభించే ఆకుకూరలు అధికంగా భుజించాలని వైద్యులు సైతం సూచిస్తున్నందున సహజంగానే ఆకుకూరలకు డిమాండ్ పెరి గింది. దీనికితోడు వేసవి ఎండలు తీవ్రరూపం చూపుతుండడంతో నీటి తడులు అందక దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండడంతో వీటి ధరలు ఆదివారం నాటికి అమాంతంగా పెరిగాయి.

- తోటకూర 4కట్టలు రూ.10కి లభించేది. ఆదివారం రూ.10కి రెండుకట్టలే లభిస్తున్నాయి.
- కొత్తిమీర పెద్దకట్ట రూ.10కి లభించేది. నేడు అదేకట్ట రూ. 20కి పెరిగింది.
- గోంగూర రెండు కట్టలు రూ.10కి లభించేది. నేడు కట్ట రూ.10కి పెరిగింది.
- బచ్చలి 4కట్టలు రూ.10కి లభించేది. నేడు రెండుకట్టలు రూ.10కి చేరింది.
- కరివేపాకు 4 కొమ్మలు రూ.10కి లభించేది. నేడు రూ.20కి పెరిగింది.
- చుక్కకూర, పాలకూరల ధరలు కూడా ఆదివారం అమాంతంగా పెరిగాయి. 5 కట్టలు రూ.20కి పెరిగాయి.

దీంతో ప్రజలు ఆకుకూరల రుచి చూడాలంటేనే ధరలు చూసి బెంబేలెత్తే పరిస్థితులు నెలకొనడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. కాగా ఆకుకూరల వ్యాపారంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో పెరిగాయని వ్యాపారులు సైతం అంటున్నారు. పనసపాడు శ్రీను మట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవకపోవడంవల్ల ఆకుకూరల ఎదుగుదల లోపించిందని, ఆకుకూరల సాగుకు తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడినందున సాగుకు అదనపు భారం ఏర్పడిందన్నారు. దూరప్రాంతాల నుంచి దిగుమతులు చేసుకునే సరుకు కాకపోవడంవల్ల స్థానికంగానే చిన్నచిన్న రైతుల నుంచి సేకరించడం వల్ల ధరలు అధికంగానే ఉన్నాయని వాపోయారు. దీంతో సహజంగానే ఆకుకూరల ధరలు పెంచాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని శ్రీను చెప్పారు.

పేలుడు విషాదం!





బాణసంచా ప్రమాదంలో మరణించిన నిర్మల (కింద) ఫైల్‌ఫోటో

- ఉలిక్కిపడిన సామర్లకోట
- అనకాపల్లి జిల్లాలో బాణసంచా ప్రమాదం
- మృతుల్లో ఒకరు సామర్లకోట మండలం వేట్లపాలెం వాసి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

సామర్లకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఆదివారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఒక మహిళ ఈ ఘటనలో మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం ఆందోళన కలిగించింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలి పని కోసం సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గూడపర్తికి చెందిన గొడత నిర్మల(38) అనే మహిళ కొన్నాళ్ల కిందట వెళ్లింది. బాణసంచా పేలుడు ఘటనలో ఆమె మృతి చెందిందన్న సమాచారంతో ఇక్కడ వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట ప్రాంతాల్లో బాణసంచా తయారీలో ఉన్న వారంతా ఉలిక్కిపడ్డారు. నిర్మల కొంతకాలం కిందట గూడపర్తి గ్రామం నుంచి మరికొందరితో కలిసి బిక్కవోలు సమీపాన కొమరిపాలెంలో బాణసంచా తయారీ పనుల నిమిత్తం అక్కడకు వెళ్లిపోయింది. అక్కడి నుంచి మరికొందరి కూలీలతో కలిసి అనకాపల్లి సమీపాన కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా తయారీ సంస్థల్లో కూలీ పనుల నిమిత్తం వెళ్లి చాలా కాలమైనట్టు వేట్లపాలేనికి చెందిన పలువురు సహచర కుటుంబీకులు తెలిపారు. నిర్మల స్వతహాగా శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మహిళ కాగా, కొన్నేళ్లుగా ఆమె వేట్లపాలెం గ్రామానికి చెందిన బుజ్జి అనే వ్యక్తితో కలిసి ఉంటున్నట్టు సమాచారం. అలాగే సామర్లకోట పెన్షన్‌లైన్‌కు చెందిన మరికొందరు వ్యక్తులు కూడా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలీ పనుల నిమిత్తం వెళ్లినట్టు సమాచారం. వీరిలో మరో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వారున్నట్టు సమాచారం రావడంతో వారి శాశ్వత చిరునామాల కోసం రెవెన్యూ సిబ్బంది ఆరా తీశారు. ఇదే ఘటనలో సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వేళంగి రాజు, భార్య వేళంగి సంతోష్, వేళంగి షరోణి తీవ్ర గాయాలతో విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామర్లకోటకు చెందిన సత్తిబాబు అనే వ్యక్తి ద్వారా సమాచారం అందింది. ఈ ఘటనతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బాణసంచా తయారీ సంస్థలన్నీ అప్రమత్తం అయ్యాయి. గత దీపావళి ముందురోజు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంతోపాటు అమలాపురం, అంతకు ముందు సామర్లకోటలోనూ బాణసంచా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి.

మట్టల ఆదివారం.. ప్రత్యేక ప్రార్థనలు

మట్టల ఆదివారం సందర్భంగా జిల్లాలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణాలు, గ్రామాల్లో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం శాంతి ర్యాలీలు నిర్వహించారు. మతపెద్దలు పాల్గొని క్రైస్తవులను నడిపించారు.

లోపలి పేజీల్లో..



మట్టల ఆదివారం పండుగ సందర్భంగా పిఠాపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

పెరిగిందోచ్..

- మార్కెట్ కమిటీలకు ఆశించిన ఆదాయం
- అనుకున్న లక్ష్యానికి మించి వసూళ్లు
- జిల్లాలోని 9 కమిటీల ద్వారా రూ.38.02 కోట్లు రాక



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మార్కెట్ కమిటీల ఆదాయం పెరిగింది. అనుకున్న లక్ష్యం కంటే కాస్త అధికంగానే ఆదాయం సమకూరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మార్కెట్ కమిటీలకు చెల్లించాల్సిన సెస్ ఎగవేయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలో ఉన్న మార్కెట్ యార్డుల్లో మౌలికసదుపాయాలు మెరుగుపడనున్నాయి. జిల్లాలో అన్ని పంటల కంటే వరి సాగు ఎక్కువ. ముగిసిన సీజన్‌లో వరి విస్తీర్ణం పెరిగింది. రైతులవద్ద పండిన సరుకును కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేసింది. ధాన్యం అమ్మకాలపై మార్కెట్ కమిటీలకు 2శాతం సెస్‌గా చెల్లించాల్సి ఉంది.

జిల్లాలోని 9మార్కెట్ కమిటీలకు 2024- 25 సీజన్‌లో రూ.35.64కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. రూ.38.02కోట్ల ఆదాయం లభించింది. అంటే అదనంగా రూ.2.35కోట్ల ఆదాయం సమకూరింది. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, రూరల్, కరప, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట మండలాల్లో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఆయా కమిటీల ఆధ్వర్యంలో నడిచే చెక్‌పోస్టులు, ట్రేడర్ రిటర్న్స్, ధాన్యం కొనుగోళ్లు, బియ్యం కొనుగోళ్ల సమయంలో రైసుమిల్లులనుంచి వచ్చే సెస్, అగ్రికల్చర్ ఫీజు, లైవ్ స్టాక్ ఇలా పలు మార్గాల్లో ఆదాయం వస్తుంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ కమిటీల వారీగా ఆదాయాన్ని పరిశీలిస్తే.. కరప మార్కెట్ కమి టీ ఆదాయం లక్ష్యం రూ.3.50 కోట్లు కాగా.. వచ్చింది రూ.3.56 కోట్లు, కాకినాడ రూరల్ కమిటీ ఆదాయ లక్ష్యం రూ.1.60కోట్లు కాగా, వచ్చింది 1.63 కోట్లు, కాకినాడ అర్బన్ కమిటీ లక్ష్యం రూ.52లక్షలు కాగా, వచ్చిన ఆదాయం రూ.52.17 లక్షలు. పిఠాపురం మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం రూ.4.95కోట్లు కాగా, వచ్చింది రూ.6.79 కోట్లు, తుని లక్ష్యం రూ.2.47 కోట్లు కాగా, వచ్చిన ఆదాయం రూ.2.48కోట్లు, సామర్లకోట ఆదాయం రూ.3.43కోట్లు కాగా, వచ్చింది రూ.3.47కోట్లు. ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ ఆదాయం రూ.3.4కోట్లుకాగా, వచ్చిన ఆదాయం రూ.3.65కోట్లు, జగ్గంపేట ఆదాయ లక్ష్యం రూ.4.88కోట్లుకాగా, చేరుకున్న లక్ష్యం రూ.4.95 కోట్లు. పెద్దాపురం మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం రూ.10.89 కోట్లు కాగా, రూ.10.94 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితం లభించిందని మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు.

శ్రీవారికి శ్రీపుష్పోత్సవం

7

- ముగిసిన వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆహ్లాదం..



భారీ వృక్షాలతో నిండిన రాయనపేట - వెంకటరెడ్డిపేట రహదారి ఏటపాక (ఆంధ్రజ్యోతి)



పచ్చటి చెట్లతో ఆహ్లాదకరంగా మారిన సామర్లకోట - కాకినాడ ప్రధాన రోడ్డు సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

వేమగిరిలో...
84 అడుగుల బుద్ధ విగ్రహం ప్రారంభం



వేమగిరిలో బుద్ధ విగ్రహాన్ని ప్రారంభించి ధర్మహాలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



కడియం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో బౌద్ధ మతం ఉందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా వేమగిరి బుద్ధవిహార్‌లో మహోదయ యాజరా ఏర్పాటు చేసిన 84 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ధర్మహాలు, వాటిలోని వివిధ రచయితల పుస్తకాలను పరిశీలించారు. పచ్చని నర్సరీల ప్రాంతంలో బుద్ధ విహార్ కేంద్రం ఏర్పాటు చేసిన యాజరాను గోరంట్ల అభినందించారు. బుద్ధవిహార్ అభివృద్ధికి రూ.25 వేలు ఇస్తున్నట్టు ప్రకటించారు. చైనా, జపాన్, కంబోడియా, కొరియా, చైనా వంటి దేశాల్లో విస్తరించి ఉండడంతో బౌద్ధ మతం ప్రపంచమతంగా ఉందన్నారు. రచయిత గౌరవ్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. యాజరా బౌద్ధమతం గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్లను సత్కరించారు. కార్యక్రమంలో పేరవరం పిరమిడ్ ధ్యానకేంద్రం ట్రస్ట్ అధ్యక్షుడు సీఎస్ మూర్తి, టీడీపీ రాష్ట్ర నాయకుడు మార్గాని సత్యనారాయణ, కోలా వెంకట్రాజు(కేవీఆర్), అక్కిన ఆనందబాబు, చందన నాగేశ్వర్, షేక్ మీరావలి, బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, దాసరి ముత్యం తదితరులున్నారు.

కొంతమూరులో నెమళ్లు
కుక్కల బారి నుంచి కాపాడిన స్థానికులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో రెండు నెమళ్ల సందడి చేశాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కొంతమూరు శేషాద్రి హిల్స్ ప్రాంతంలో ఆదివారం ఒక నెమలిని కుక్కలు తరుముండగా స్థానికులు కాపాడి రాజమండ్రి ఫారెస్ట్ రేంజర్ దావీద్‌రాజుకు అప్పగించారు. తర్వాత మరో నెమలిని స్థానికులు తీసుకొచ్చి అప్పగించారు. ఇవి రెండూ ఆడ నెమళ్లు. వివరాలిలా ఉన్నాయి. కొంతమూరు శేషాద్రి హిల్స్ సమీపంలో ఆదివారం ఉదయం ఒక నెమలిని కుక్కలు తరుమున్నాయని చెప్పి, ఇక్కడి నివాసి అయిన కేవీ మాధవరావు, కుటుంబ సభ్యులు అనంతలక్ష్మి, సాత్విక్ దత్తు దానిని స్థానికుల సహాయంతో కాపాడి రేంజ్ ఆఫీసర్‌కు ఇచ్చారు. కొందరు స్థానికులు మరో నెమలిని తెచ్చి ఇచ్చారు. దానికి కాలికి వేళ్లు వంకరగా ఉన్నాయి. పుట్టుకతోనే అలా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి. ఎవరైనా తీసుకొచ్చారా? ఈ ప్రాంతంలోనే ఉంటున్నాయా? అనే కోణం నుంచి ఆరా తీస్తున్నట్టు దావీద్‌రాజ్ తెలిపారు. వీటికి ఏవిధమైన గాయాలు కాలేదని, సోమవారం వైద్యుడితో పరీక్షలు చేయించి ఉన్నతాధికారుల సలహాతో ఫారెస్ట్‌లో వదిలేయడం లేదా, జూపార్కుకు ఇవ్వడం విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం క్షేమంగా అటవీ అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. వీటి వయస్సు మూడేళ్ల నుంచి 4 ఏళ్లలోపు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



కుక్కల బారి నుంచి కాపాడి నెమలిని అధికారికి అప్పగిస్తున్న స్థానికులు



కాలి వేళ్లు వంకర ఉన్న నెమలిని ఫారెస్ట్ రేంజర్‌కు అప్పగిస్తున్న స్థానికులు

అప్పు తీర్చమన్నందుకు.. అతి కిరాతకం!
దొమ్మేరు హత్య కేసులో వీడిన మిస్టరీ, ముగ్గురి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమన్నందుకు పథకం ప్రకారం వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్య చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన పెండ్యాల ప్రభాకరరావు వేస్టేజి కంపెనీ ఉత్పత్తుల ఏజెంట్ల ద్వారా విక్రయిస్తుంటాడు. పోలవరం మండలం పాత పట్టిసంకు చెందిన చుక్కా రామ శ్రీనివాస్ తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామ సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లు, విలాసాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. ఇద్దరికీ గత కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. దీంతో 2024 డిసెంబర్‌లో ప్రభాకరరావు వద్ద శ్రీనివాస్ రూ.2,40,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని ప్రభాకరరావు పదే పదే అడిగేవాడు. అతడి చంపేస్తే బాకీ తీర్చనవసరం లేదు, ఒంటిపై ఉన్న బంగారపు వస్తువులు అమ్ముకుని ఇతర బాకీలు తీర్చుకోవచ్చని శ్రీనివాస్ నిర్ణయించుకున్నాడు.

పథకం ప్రకారం రప్పించి...

దీంతో దొండపూడి గ్రామానికి చెందిన అంకోలు జగదీశ్ దుర్గాప్రసాద్, పోలవరానికి చెందిన నోముల ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పథకం వేశాడు. 2025 మార్చి 26న రాత్రి 8 గంటలకు ప్రభాకరరావుకు ఫోన్ చేసి బయటకు రప్పించాడు. యాక్టివా మోటారుసైకిల్‌పై ప్రభాకరరావు, శ్రీనివాస్ దొమ్మేరు పుంతలోని నీరుకొండ శేషగిరిరావు డ్రాగన్‌ఫ్రూట్ తోటలోకి వెళ్లారు. ప్రభాకరరావును శ్రీనివాస్ కత్తితో వెనుక నుంచి తలపై, వీపుపై పలుమార్లు దాడి చేశాడు. కిందపడిన తరువాత కంఠంపై నరికివేసి కిరాతకంగా హతమార్చాడు. తరువాత మెడలో ఉన్న బంగారపు గొలుసు, ఎడమచేతికి ఉన్న ఉంగరం తీసుకున్నాడు. కుడి చేతికి ఉన్న బంగారపు కడియం, 3 ఉంగరాలు తీయబోగా రాకపోవడంతో కుడిచేతి గుత్తిని నరికి చేతిని పేపర్లో చుట్టుకుని, చెయ్యి, హత్యకు ఉపయోగించిన కత్తి, దొంగిలించిన బంగారపు గొలుసు, ఉంగరం సెల్‌ఫోను బ్యాగులో పెట్టుకున్నాడు. దుర్గాప్రసాద్‌ను రమ్మని ఫోన్ చేసి దొమ్మేరు, కాపవరం మీదుగా పోలవరం ఇంటికి వెళ్లిపోయారు. పోలవరంలో నో ముల ప్రవీణ్‌కుమార్‌కు విషయం చెప్పి, ము గ్గురు కలిసి నరికిన చెయ్యికి ఉన్న కడియం, 4 ఉంగరాలను తీసుకున్నారు. చెయ్యిని, కత్తిని, మృతుడు సెల్‌ఫోన్‌ని, హత్య చేసినప్పుడు శ్రీనివాస్ ధరించిన దుస్తులు, బ్యాగుని గూటాల గ్రామంలో గోదావరి నదిలోకి విసిరివేశారు. దొంగిలించిన బంగారం వస్తువులను కొయ్యలగూడెం, తాళ్లపూడి మండలాల్లో తాకట్టుపెట్టి ముగ్గురు పరారయ్యారు. మృతుడి భార్య పెం డ్యాల అనంతలక్ష్మి అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.విశ్వం కేసు నమోదు చేశారు.

కేసును ఛేదించిన కొవ్వూరు పోలీసులు

విచారణ అనంతరం ఈనెల 12న హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను సీఐ విశ్వం అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు. రామ శ్రీనివాస్ నుంచి 31.8 గ్రాముల బంగారపు గొలుసు, 4.9 గ్రాముల ఉంగరం, నేరానికి ఉపయోగించిన హోండా ఎస్‌పి మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, జగదీశ్ దుర్గాప్రసాద్ నుంచి నేరానికి ఉపయోగించిన టీవీఎస్ రైడర్ మోటారుసైకిల్, సెల్ ఫోను, ప్రభాకరరావు నుంచి సెల్‌ఫోను, గూటాల వద్ద గోదావరిలో పడవేసిన హత్యకు ఉపయోగించిన కత్తిని, మృతుడి సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కేసు ఛేదించినందుకు కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, ఎస్ఐలు పి.రవీంద్ర, కె.శ్రీహరిరావు, కె.జగన్మోహనరావు, సిబ్బందికి డీఎస్పీ రివార్డులను అందజేశారు.

'జగన్ రూపంలో రాష్ట్రానికి పొంచి ఉన్న ప్రమాదం'

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అతిపెద్ద ప్రమాదం, ఉపద్రవం వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రూపంలో పొంచి ఉందని ఇంటిలిజెన్స్ చీఫ్ విశ్రాంత అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంకలోని జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తుల శ్రీను సహా ఆయన కుటుంబాన్ని ఆదివారం వెంకటేశ్వరరావు కలిశారు. వారితో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటానన్నారు. అనంతరం అమలాపురంలోని దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించిన తర్వాత ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నాకేదైనా సమాచారం ఇవ్వాలన్నా, ముఖ్యమైన మెసేజ్ చేయలన్నా, వాట్సాప్ నెంబరు 7816020048కు మెసేజ్ చేయవచ్చు' అని ప్రజలకు పిలుపునిచ్చారు. కోడి కత్తి శ్రీను కుటుంబానికి అన్నివిధాలా సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉత్కంఠభరితంగా..
వెలుగుబందలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి పరుగు పోటీలు
ప్రథమస్థానంలో అనకాపల్లి
ద్వితీయస్థానం సొంతం చేసుకున్న కోనసీమ



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల బండి

రాజానగరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలో గ్రామదేవత శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కూటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి రౌండ్ పరుగు పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 23 జతల ఎడ్ల బండ్లు సత్తా చాటాయి. జిల్లాలోనే తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా లెక్కలవానిపాలేనికి చెందిన పెద పైడితల్లమ్మ(సత్తిబాబు) ఎడ్ల బండి ప్రథమస్థానం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల తేజా చౌదరికి చెందిన ఎడ్ల బండి ద్వితీయస్థానం, విజయనగరం జిల్లాకు చెందిన కె.రాము నాయుడికి చెందిన ఎడ్ల బండి తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే విజయనగరం జిల్లా విలిపాడుకు చెందిన మరిడిమాంబకు చెందిన ఎడ్ల బండి నాల్గోస్థానం, అనకాపల్లి జిల్లా అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడుకు చెందిన ఎడ్ల బండి ఐదో స్థానం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల తేజాచౌదరి ఎడ్ల బండి ఆరో స్థానం, అనకాపల్లి జిల్లా రేవళ్లకు చెందిన పంచాడ వెంకటరావుకు చెందిన ఎడ్ల బండి ఏడో స్థానం, అనకాపల్లి జిల్లా దేవరపల్లికి చెందిన శ్రీవీరాం జనేయకు చెందిన ఎడ్ల బండి ఎనిమిదో స్థానంలో నిలిచాయి. న్యాయ నిర్ణేతగా మజ్జి దేవానంద్ వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బహుమతి ప్రదానం చేశారు.



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల



వారెవ్వా అనేలా.. పెరట్లో అరటిగెల..

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం పెదపేటలో పల్లికొండ రాధా ఇంటి పెరట్లో అరటిగెల అబ్బురపరుస్తుంది. బూడిద అరటిరకం చెట్టుకు 22 అస్తాలతో గెల పెరిగింది. ఒక అస్తానికి 22 కాయలు కాశాయి.

- ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి)

'లోవ'లో వార్షిక జాతర ప్రారంభం



జాతరను ప్రారంభిస్తున్న దృశ్యం

తుని రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ వార్షిక జాతర వేడుకలు ఆదివారం ప్రాంభమయ్యాయి. అమ్మవారి ప్రతిరూపంగా పూజించే గరగలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భాజాభజంత్రీలు, గరగల నృత్యాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ మాజీ ఛైర్మన్ దూలం మాణిక్యం, ఆలయ ఈవో విశ్వనాధరాజు అమ్మవారి గరగలు శిరస్సున ధరించి ఉత్సవాలను ప్రారంభించారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈనెల 27న లోవకొత్తూరు గ్రామంలో గంధ అమవాస్య వేడుకను దేవదయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

రూ.5.8 లక్షల ఆదాయం

లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.8 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో తెలిపారు.

నూకాలమ్మ ఆలయానికి రూ.11లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మలికిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లిలో నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి లక్కవరానికి చెందిన ముదునూరి సుబ్బరాజు-లక్ష్మీనర్సాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ముదునూరి సత్యసూర్యసీతారామరాజు, ముదునూరి వెంకటసుబ్బరాజు, ముదునూరి గోపాలకృష్ణంరాజు (చినబాబు) రూ.11 లక్షల విరాళాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. నూకాలమ్మ చారిటబుల్ ట్రస్టుకు విరాళాన్ని అందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు సుంద్ర బ్రహ్మయ్య, కటికిరెడ్డి సత్యనారాయణ, కటికిరెడ్డి గోపాలకృష్ణ, దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్టు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శనివారం ఇంద్రపాలెం, కొరింగ, గొల్లపాలెం ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఒక గదిలో పేకాటడుతున్న పది మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రదేశంలో లభించిన రూ.42,750, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ సూర్యకుమార్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి కాంపౌండ్‌లో పేకాట ఆడుతుండటం విశేషం. మాజీ ఎమ్మెల్యే స్థానికంగా నివాసం ఉండకపోవడంతో కొంతమంది దీనిని పేకాట శిబిరంగా మార్చినట్టు స్థానికులు చెప్తున్నారు.



మువ్వన్నెల వర్ణం!

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం జాతీయ పతాకాన్ని తాకతున్నట్టు ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది.

- గండేపల్లి (ఆంధ్రజ్యోతి)

శ్రీవారికి శ్రీపుష్పోత్సవం
ముగిసిన వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి శ్రీపుష్పోత్సవం వేడుకగా నిర్వహించారు. విద్యుత్, ఫలపుష్ప అలంకరణ సాంస్కృతిక ప్రదర్శనలు, కళాకారుల వాయిద్యాలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం స్వామివారికి మేలుకొలుపు, నిత్యార్చన, నిత్యహోమాలు, దిగ్దేవత బలిహరణ, ద్రవిడ వేదపారాయణం, నిరాజన మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ద్వాదశ ప్రదక్షిణలు, ఫలప్రసాద నివేదన, ముఖమండపంలోని స్వామివారి అద్దాల మేడలో శ్రీపుష్పోత్సవం కనుల పండుగగా జరిగింది. ఫలపుష్పాలతో అలంకరించిన ఊయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ జరిగింది. ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. అశేషభక్తజనం కల్యాణోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వామివారికి ఏకాంత సేవ నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారికి ఫలప్రసాద నివేదన

సీతారాములకు శ్రీపుష్పయోగం

అన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి శ్రీపుష్పయోగంతో ముగిసాయి. రాత్రి 8 గంటలకు నవదంపతులైన సీతారాములను, పెళ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను వేర్వేరు వేదికలపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం నవ దంపతులకు వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో ఆశీనులు గావించి పుష్పార్చన చేశారు. వివిధ రకాలైన మదురఫలాలు, తీపి పదార్థాలను నివేదించారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీతాంబూలాలు అందజేశారు. ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ఊగుటూయలలో సీతారాములు

కాకినాడ

అధికారులకు పట్ట 'నట్టు'







ఇది నగరంలోని జగన్నాథపురం బ్రిడ్జి. ఈ రోడ్డుపై స్ప్రింగ్ పోల్స్ విరిగిపోయాయి. అయితే రోడ్డుపై బిగించిన ఇనుప నట్టులు తీయకపోవడంతో ఇలా పైకి కనిపిస్తున్నాయి. అవి కాళ్లకు గుచ్చుకుని పాదచారులు, టైర్లలోకి దిగి వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు వాపోతున్నారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం: కలెక్టర్ షాన్‌మోహన్

గొల్లప్రోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ సగిలి షాన్ మోహన్ అన్నారు. మండలంలోని చేబ్రోలులో దివంగత డాక్టర్ గజరావు సీతారామస్వామి ఆసుపత్రిలో సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ సీతారామస్వామి ప్రతిఏటా ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసేవారని, ఆ సంప్రదాయాన్ని కుటుంబసభ్యులు కొనసాగించడం అభినందనీయమన్నారు. 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించి 80 మంది కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి ఉచితంగా నిర్వహించేందుకు వారిని ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందు సీతారామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ఐపీఎస్ అధికారి డాక్టర్ గజరావు భూపాల్, డాక్టర్ అనురాధ, కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పూజారెడ్డి, రహీమున్నీసా, రావు నవీన్‌కుమార్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, డాక్టర్ చంద్రశేఖర్, ఐపీఎస్ అధికారి డాక్టర్ భూపాల్



కాకినాడ సూర్యారావుపేటలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ రూరల్ వలసపాకలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి-సత్యనారాయణమూర్తి దంపతులు

'హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలు'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ గోశాలలో గోవుల మరణాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యారావుపేటలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోశాలలో ఆవులను చంపేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కుట్రలు పన్నుతున్నారన్నారు. గోశాలలో ఆవులు చనిపోయాయంటూ ఆయన చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. వృద్ధాప్యం, ఇతర వ్యాధులతో కొన్ని ఆవులు మృత్యువాతపడితే వాటిని కూడా వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారు. గోశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టిసారించి గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమల లడ్డూ నాణ్యతను పెంచిందన్నారు. అవినీతి, అక్రమాలతో టీటీడీ ఖజానాను దారిమళ్లించి ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, డాలర్ల మాయం వంటి దుశ్చర్యలకు పాల్పడిన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకర్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కొండబాబు కోరారు. సమావేశంలో నాయకులు తలాటం నాని, పసుపులేటి వెంకటేశ్వరరావు, చెన్నంశెట్టి గోవిందరాజులు, జొన్నాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని టీటీడీ బోర్డు మాజీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఆదివారం వలసపాకలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు కరుణాకర్ రెడ్డి పాల్పడ్డారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో స్వామివారి ప్రసాదాన్ని దారిమళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర ఆయనదన్నారు. కుమార్తె పెళ్లిని క్రైస్తవ మతాచారాలతో చేసిన ప్రబుద్ధుడు అని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేదంటే భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రతిష్ఠను దిగజార్చే విధంగా దుష్ప్రచారం చేయడం తగదని, వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ హితవు పలికారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎక్కడికక్కడ అవినీతిని కట్టడి చేశారన్నారు. అది ఓర్వలేకే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి గోశాలలో గోవులు చనిపోతున్నాయని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.





పిఠాపురం పట్టణం (పైన), గొల్లప్రోలు మండలం చేబ్రోలులో (కుడి) ఈత మట్టలతో క్రైస్తవుల ప్రదర్శన

ఘనంగా మట్టల ఆదివారం

పిఠాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. చర్చి సెంటర్లోని అతి పురాతనమైన ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో పువ్వులతో అలంకరించిన ఈత మట్టలను పట్టుకుని క్రైస్తవులు పుర వీధుల్లో ప్రదర్శన జరిపారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని చిత్రాడ, ఎల్ఎన్ పురం, గోకివాడ తదితర గ్రామాల్లో క్రైస్తవులు ప్రదర్శన జరిపారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం జరుపుకున్నారు. చేబ్రోలులోని ఆంధ్ర బాప్టిస్టు సంఘం చిల్డ్రన్ అండ్ యూత్ అలంకరించిన ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. సంఘకాపరి మంగం జాన్ ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలోను, మండలంలోను ఈత మట్టలకు పూలు గుచ్చి వస్త్రాలు, చీరలు పరిచి వాటిపై నడుస్తూ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆర్సీఎం చర్చి సేవకులు, సండే స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.



సామర్లకోటలో ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆకట్టుకున్న చిన్నారుల స్నాతకోత్సవం



సంప్రదాయ దుస్తుల్లో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని రవీంద్ర భారతి స్కూల్లో చిన్నారుల స్నాతకోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడి డ్యాన్స్ చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీపీఆర్ రత్నకుమారి చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, సీజీఎం వసంత, ఏజీఎం బి.వెంకట రామలింగేశ్వర్, డీఐ ఉత్తమ్‌చంద్ పాల్గొన్నారు.

'వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కృషి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఆదివారం తిమ్మాపురంలో వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు, జనసేన అధ్యక్షుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ విస్తరణ, ఆధునికీకరణ పనులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు చోడిశెట్టి ఇంద్ర, బత్తుల దొరబాబు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు తాతాజీ



వంటకాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

నూకాలమ్మ ఆలయం వద్ద అన్నదానం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక టూటౌన్ సమీపంలోని నూకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మాంసాహార వంటకాలతో సుమారు 4వేల మందికి అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తలాటం నాని, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు, నాయకులు తలాటం సత్య, పి.వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి శివ, సీహెచ్ గోవిందరాజులు, ఆకుల శ్రీనివాస్, బడే కృష్ణ, మండపాక దుర్గాప్రసాద్, గొట్టుముక్కల రమణరాజు, మాసిం శ్రీను, చెన్నంశెట్టి దుర్గాభవాని, దవులూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



బాధిత మహిళకు నగదు అందజేస్తున్న చారిటీ టీమ్ సభ్యులు

అనారోగ్యంతో ఉన్న మహిళకు అండ

రూ.50వేలు అందించిన గుడ్ ఫ్రెండ్స్ చారిటీ టీమ్ సభ్యులు

పిఠాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న మహిళకు గుడ్ ఫ్రెండ్స్ చారిటీ టీమ్ అండగా నిలిచింది. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో నివాసముంటున్న కేశబోయిన నవీన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ఏడు ఆపరేషన్లు చేశారు. అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికపరంగా నవీన విషయాన్ని తెలుసుకున్న గుడ్ ఫ్రెండ్స్ చారిటీ టీమ్ సభ్యులు రూ.50 వేలు సేకరించారు. ఆదివారం ఆ మొత్తాన్ని నవీన, ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. రెండు నెలలుగా సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఆమె తదుపరి ఆపరేషన్‌కు తామంతా అండగా ఉంటామని చారిటీ టీమ్ సభ్యులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీమ్ ప్రతినిధులతో పాటు మన ఊరు-మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో పేకాట శిబిరంపై దాడి

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు సత్తెమ్మ తల్లి గుడి సమీపంలో పేకాట శిబిరంపై గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.10,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉప్పుటేరులో పడి మత్స్యకారుడు మృతి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు ఉప్పుటేరులో పడి మత్స్యకారుడు మృతి చెందాడు. మూడే గోవిందరాజు (35) కొవ్వూరు ఎస్సీపేట సమీపంలోని ఉప్పుటేరులో చేపలు పట్టే సమయంలో జారిపడి వలలో చిక్కుకుపోయాడు. మృతుడు సోదరుడు నాగ శ్రీను అన్న మృతదేహాన్ని గుర్తించి ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంద్రపాలెం ఎస్ఐ సూర్యకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పుచ్చకాయపై అంబేడ్కర్ చిత్రం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు వెజిటబుల్ కార్వింగ్ కళ ద్వారా పుచ్చకాయపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని చెక్కారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గురించి అందరికీ అవగాహన కల్పించేందుకు దీనిని చిత్రించినట్టు గోవిందరాజులు తెలిపారు.

బి.ప్రత్తిపాడు జాతరలో వివాదం

ఉద్రిక్తత, చెదరగొట్టిన పోలీసులు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడులో పెద్దింటమ్మ తల్లి జాతర సందర్భంగా శనివారం అర్ధరాత్రి సమయంలో వివాదం చోటుచేసుకుంది. డీజేలో గ్రామస్తులను వేదికపైకి ఆహ్వానిస్తున్న తరుణంలో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెండు వర్గాలు బాహాబాహీకి సిద్ధపడ్డాయి. సమాచారం అందుకున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు అక్కడకు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. వివాదానికి కారణమైన వారిని అక్కడి నుంచి పంపించి గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వివాదాలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



రంగురంగుల ఊలుదారాల పూల అలంకరణలో అమ్మవారు

నూకాంబిక అమ్మవారికి విశేష అలంకారం

సామర్లకోట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట గ్రామ దేవతగా ప్రసిద్ధి గాంచిన స్టేషన్ సెంటర్ నూకాంబిక అమ్మవారిని దీపారాధన సంఘం భక్తులు రంగురంగుల ఊలుదారాలతో అల్లిన పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. సుమారు 10 అడుగుల చీరతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ అలంకారాన్ని 15 రోజులు కొనసాగిస్తామని నిర్వాహకులు చెప్పారు. అమ్మవారి దర్శనానికి సామర్లకోట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

'ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి'

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దాళ్వా వరి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారని కాకినాడ మాజీ ఎంపీ, వైసీపీ పిఠాపురం ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, సీతానగరం, లక్ష్మీపురం గ్రామాల్లో పొలాల్లో ఉండిపోయిన ధాన్యం రాశులను ఆమె ఆదివారం పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి ఇబ్బందులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఫోనులో వివరించి ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వచ్ఛ భారత్

గొల్లప్రోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహాన్ని, పరిసరాలను బీజేపీ నాయకులు ఆదివారం శుభ్రం చేశారు. అక్కడ దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిట్టా మధు, నాయకులు మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, మేడసాని కామరాజు, వియ్యపు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

జగ్గంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంపాలెంలో రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆదివారం ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కళ్ల పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పడాల వీరవెంకట సత్యనారాయణ, గుర్రంపాలెం గ్రామ టీడీపీనాయకులు పడాల రాంబాబు ప్రారంభించారు. పడాల బాలాజీ, పడాల విష్ణు, పడాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక




గన్నవరంలో విరిగిపడిన చెట్టు. పక్క చిత్రంలో రామాలయంలో ఒరిగిన ధ్వజస్తంభం

ఏజెన్సీలో గాలివాన బీభత్సం

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లు

ఎటపాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. తీవ్రమైన గాలి దుమారానికి విద్యుత్ స్తంభాలు, రేకుల షెడ్లు, చెట్లు విరిగిపడ్డాయి. ప్రధానంగా తోటపల్లి పంచాయతీలోని కుసుమనపల్లి గ్రామంలో నాలుగు విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. కృష్ణవరం, గన్నవరం, తోటపల్లి, గన్నేరుకొయ్యపాడు, విస్సాపురం తదితర గ్రామాల్లో చెట్లు విరిగిపడి పోయాయి. గన్నవరంలో పీర్ల సావిడికి చెందిన రెకుల షెడ్డు ధ్వంసమైంది. పురుషోత్తపట్నం రామాలయంలో ధ్వజ స్తంభం పక్కకు ఒరిగిపోయింది. విలీన మండలాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

స్తంభించిన జనజీవనం

మారేడుమిల్లి, (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. మారేడుమిల్లి-రంపచోడవరం ప్రధాన రహదారిలో భారీ వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలిగింది. మామిడి, జీడిమామిడి రైతులు ఆందోళనకు గురయ్యారు. ఫలసాయం చేతికి వచ్చే సమయంలో పంట నేలరాలిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.




సిబ్బంది గృహాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న అటవీశాఖ అధికారులు. పక్క చిత్రంలో లక్కవరం రేంజ్‌లో పర్యటిస్తున్న దృశ్యం

లక్కవరం రేంజ్‌లో అటవీ అధికారుల పర్యటన

మోతుగూడెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ ఏకే నాయక్, రాజమండ్రి సర్కిల్ సీసీఎఫ్ బీఎస్ఎస్ మూర్తి, చింతూరు డీఎఫ్‌వో బబిత ఆదివారం చింతూరు అటవీ డివిజన్ పరిధిలోని లక్కవరం రేంజ్‌లో పర్యటించారు. సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద జరుగుతున్న వెదురు సేకరణ పనులు, తులసిపాక వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎంసీ చెక్‌పోస్టు నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. మోతుగూడెంలో ఇటీవల పునరుద్ధరించిన అటవీశాఖ సిబ్బంది గృహాల సముదాయాన్ని ప్రారంభించారు. పర్యటనలో లక్కవరం రేంజ్ ఆఫీసర్ జీవీ నానాజీ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.భానుప్రకాష్, దబ్బగూడెం సెక్షన్ ఆఫీసర్ అడపా మోహన్ సూర్యకిరణ్, లక్కవరం సెక్షన్ ఆఫీసర్ పులి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ తెల్లం దుర్గాప్రసాద్

యువత చదువుకుంటే ఉపాధి అవకాశాలు పుష్కలం

చింతూరు సీఐ దుర్గాప్రసాద్

మోతుగూడెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దబ్బగూడెంలో ఆదివారం చింతూరు సీఐ దుర్గాప్రసాద్, డొంకరాయి ఎస్ఐ శివమార్, పోలీసు సిబ్బంది పర్యటించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో యువత ఆర్థిక సమస్యల వల్ల మధ్యలోనే చదువుని ఆపేస్తున్నారన్నారు. గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వాలు హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటుచేసి ఎటువంటి ఖర్చు లేకుండా చదవిస్తోందన్నారు. రిజర్వేషన్ వున్నందున ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. కష్టపడకుండా వచ్చే డబ్బు కోసం చెడు మార్గాల వైపు వెళ్లొద్దన్నారు. గంజాయి కేసులో ఇరుక్కుంటే ప్రభుత్వ పథకాలు కూడా రావని, తద్వారా సంపాదించే ఆస్తులను కూడా ప్రభుత్వం జప్తు చేస్తుందన్నారు. గ్రామాల్లోకి మావోయిస్టులు వస్తే పోలీసులకు రహస్యంగా సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు తగిన నగదు బహుమతి ఇస్తామన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

అడ్డతీగల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రపురం గ్రామంలోని పాఠశాలలో భవిత సంస్థ ఆధ్వర్యంలో 'విద్యార్థులు-తల్లిదండ్రులు' అంశంపై ఆదివారం ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ విభాగాల్లో విద్యార్థులకు వక్తృత పోటీలు నిర్వహించారు. చంద్ర ప్రియదర్శిని, బి.రాకేష్ (ప్రథమ), త్రిపుర, హేమమాలిని (ద్వితీయ) వీరలోవ సంజన, వీరబాబు (తృతీయ) బహుమతులను ఎంపీటీసీ ఉమామహేశ్వరి అందజేశారని భవిత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ప్రభుదాస్ తెలిపారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

అనుదీప్‌కుమార్‌కు డాక్టరేట్



మారేడుమిల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వనవాసీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్‌కు దక్షిణాఫ్రికకు చెందిన ఎపిక్రైజో ప్రొఫెటిక్ బైబిల్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. వనవాసీ సంస్థ ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలకు అంబు లెన్స్ సౌకర్యం కల్పించడం, గిరిజన విద్యార్థులకు విద్యలో తోడ్పాటు నందించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రోత్సహించడం, ఏజెన్సీ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి సేవలు అందించినందుకు కుమార్‌కు సోషల్ వర్క్ విభాగంలో డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

జగ్గంపేటలో పందుల వీరవిహారం



డ్రైనేజీల్లో సంచరిస్తున్న పందులు

● ఆందోళనలో ప్రజలు
● పట్టించుకోని అధికారులు, నాయకులు

జగ్గంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పట్టణంలో పందులు పెరగడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన గల తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఫైర్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో పందులు విపరీతంగా తిరగడంతో అనేక రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో దీనిపై ఫిర్యాదు చేయగా పందులను వేరే చోటకు తరలించుకుపోయారని మళ్లీ తీసుకొచ్చి వందల కొలదీ పందులను వదలివేయడంతో జన సంచారం మధ్యలో పందులు సంచరించి అనేక రోగాలు వచ్చే అవకాశం ఉందని చెప్తున్నారు. పందుల కాపరులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పందులను ఊరికి దూరంగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జెడ్‌రాగంపేటలో ఈత మట్టలు పట్టుకుని వెళుతున్న చిన్నారులు



కత్తిపూడిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

గండేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మట్టల ఆదివారం సందర్భంగా మండల గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జెడ్‌రాగంపేటలో పాస్టర్లు సుదర్శన్‌రావు, సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు ఈత మట్టలకు పువ్వులు అలంకరించి ఊరేగించారు.

శంఖవరం: కత్తిపూడిలో ఆర్‌సీఎం చర్చి విశ్వాసుల ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసు పునరుత్థాన పండుగ సందర్భంగా ఆయన అనుభవించిన శ్రమదినాలకు గుర్తుగా 40 రోజులు క్రైస్తవులంతా ఉపవాసంలో ఉండి మట్లతో ఊరేగింపు చేశారు. కత్తిపూడిలో గ్రామప్రదక్షిణ నిర్వహించి భక్తితో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి విశ్వాసులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో మట్ల ఆదివారంలో పాల్గొన్న క్రైస్తవ బాలలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మట్ల ఆదివారం సందర్భంగా క్రైస్తవులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ దేవాలయం ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు జెరుసులాం ప్రవేశ యాత్ర ఆరాధన కార్యక్రమం ఘనంగా జరిపారు. సంఘ కాపరి గుంట ఆనందరావు, పాస్టర్ జి.సుందర్రావు మట్ల ఆదివారం విశిష్టతను వివరించారు. ప్రధాన రహదారి మీదుగా పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ప్రపంచ శాంతి కోసం క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ సానా సతీష్‌కు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం విజ్ఞప్తి చేశారు. కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ సానా సతీష్‌ను గొర్ల మాణిక్యం కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో యాక్ట్ 30, జీవో ఎంఎస్ 114 విడుదల చేశారని అయితే జనరల్ ఎలక్షన్ కోడ్ కారణంగా చివరి దశలో ఆగిపోయిందని సానా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సతీష్ అన్నారు. అనంతరం ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ ఉపాధ్యక్షుడు గింజాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సానా సతీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న గొర్ల మాణిక్యం



ప్రత్తిపాడులో సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టీటీడీ గోవులపై రాజకీయాలు తగవు

● టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం గోవులపై వైసీపీ విషరాజకీయాలకు తెరలేపి పైశాచిక ఆనందం పొందుతూ మత విద్వేషాలకు రెచ్చగొట్టే కుట్రలకు పాల్పడుతోందని టీడీపీ నాయకులు విమర్శించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ నాయకులు బద్ది రామారావు, వెన్నా ఈశ్వరుడు, కొమ్ముల కన్నబాబు, ఇళ్ళ అప్పారావు, సూరి బూరయ్య మాట్లాడుతూ టీటీడీలోని గోశాలలో గోవులు మరణించాయంటూ వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి అసత్యప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. భూమన వ్యాఖ్యలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది వెంకన్న భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా ఉన్నాయని, టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారానికి వైసీపీ నాయకులు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. గోశాలలో వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో నెలకు 10 ఆవులు చనిపోవడం సాధారణమని, గడిచిన 3నెలల్లో 40 ఆవులు మృత్యువాత పడగా 100 చనిపోయాయంటూ కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. సమావేశంలో బొల్లు కొండబాబు, మంతెన శ్రీను, మదినే దొరబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, బద్ది రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ మండల ఇన్‌చార్జిల నియామకం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏలేశ్వరం రూరల్, పట్టణ ఇన్‌చార్జిలుగా సాపశెట్టి లోవరాజు, రెడ్డి లోవరాజు నియమితులయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో సత్తిరాజు పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు జారీ చేసిన నియామక పత్రాలను లోవరాజులు ఇద్దరికీ అందజేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని సత్తిరాజు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, నియోజకవర్గ ప్రోగ్రాం ఇన్‌చార్జి కందా వీరాస్వామి, మదినే బాబ్జి, ఇంటి బాబురావు, చింతాకుల రామకృష్ణ, మూరా కృపారాయి, గున్నాబత్తుల రాజబాబు, తేజోమూర్తుల ఉషారాణి పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ సత్తిరాజు

'ఎంఎంఆర్' సేవలను వినియోగించుకోవాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ఎంఎంఆర్ ట్రస్టు సేవలు అందిస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు కోరారు. మండలంలోని పోతులూరు గ్రామంలో ఆయన పర్యటించి కార్యకర్తలు, నాయకులు, గ్రామపెద్దలు, అభిమానులతో సమావేశమయ్యారు. ఆపదలోను, ప్రమాదాల్లోను బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం ట్రస్టు అనేక సేవలు చేస్తోందన్నారు. నిరుపేదలు, నిస్సహాయులకు సహాయ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సమావేశంలో రేఖ కృష్ణార్జునరావు, పంచాది చంటిబాబు,కోలా తాతబాబు, జువ్వల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పోతులూరులో గ్రామపెద్దలతో సమావేశమైన మురళీకృష్ణంరాజు

'దళితుల ఆశాజ్యోతి అంబేడ్కర్'



జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఉన్న షాదీఖానలో ఆదివారం దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సిద్ధాంత ప్రచారకులు, నీలపల్లి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఒమ్మి రఘురాం, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అమ్మ ఐకేర్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రావుల గణేష్ రాజా, కరుటూరి వీర్రాజు, ఎస్‌ఏ గఫూర్, రామకుర్తి జగ్గలు, దళిత నాయకులు పులిప్రసాద్, మురారి రవికుమార్, కడితి దత్తు, మర్రిపృథ్వీరాజు, తిరుపతి మూర్తి, జనసేన నాయకులు కురుమళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

జగ్గంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతమైన జగ్గంపేటలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు.

లెక్చరర్లు లేకుండా ఇంటర్‌లో ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యకు సంబంధించి 3 సబ్జెక్టులకు లెక్చరర్లు లేకపోయినా ఆ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలు సాధించిన ఘనత కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ ప్రభుత్వ బాలికల కళాశాలకు లభించింది. లంపకలోవ హైస్కూల్ ఆవరణలో బాలికల కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు లెక్చరర్ల నియామకం చేపట్టలేదు. అయినప్పటికీ హైస్కూల్ హెచ్‌ఎం రాజేష్ జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వహిస్తూ ఆయా సబ్జెక్టులపై స్కూల్ అసిస్టెంట్లతో విద్యాబోధన చెప్పించారు. అయితే ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం ఒక బాలిక, ద్వితీయ సంవత్సరం 13 మంది బాలికలు పరీక్షలు రాశారు. వీరిలో ఇంటర్‌మొదటి సంవత్సరం బాలికతో పాటు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన బాలికల్లో నలుగురు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేష్, గ్రామపెద్దలు అభినందించారు.

ధాన్యం ట్రాక్టరు బోల్తా



పొలాల్లో బోల్తాపడిన ధాన్యం ట్రాక్టరు

శంఖవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శంఖవరం శివారు సిద్ధావారి చెరువు సమీపంలో ధాన్యం ట్రాక్టరు బోల్తా పడింది. ఎక్కువ మలుపులు ఉన్న ప్రాంతం కావడంతో ట్రాక్టరు అదుపుతప్పి బోల్తాపడినట్టు రైతులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు గానీ ధాన్యం నీటి పాలయ్యింది. పంట పొలాల్లో ట్రాక్టరు బోల్తాపడడంతో కొంతవరకూ రైతుకు నష్టవాటిల్లింది. స్థానికులు, కూలీల సహాయంతో ధాన్యాన్ని వేరే వాహనంలో గమ్యస్థానానికి తరలించారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎంపిక

ఏలేశ్వరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఉపాధ్యాయ సంఘం భవనంలో విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించి గౌరవ అధ్యక్షుడిగా ఉద్దగిరి సోమరాజు, అధ్యక్షుడిగా ఉడతా రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా వాసా పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా అలమండ బీఎస్ ప్రసాద్, కోశాధికారిగా మజ్జి తాతారావు, కార్యదర్శులుగా జి.విల్సన్‌బాబు, స్వర్ణకుమారి, కుమారి చిల్లా రేవతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని రావచంద్రరావు, ఇబ్రహీంఖాన్ తదితరులు అభినందించారు.

సత్యసాయి గ్రామోత్సవం



సత్యసాయిని ఊరేగిస్తున్న భజన బృందం

గండేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పి.నాయకంపల్లి గ్రామంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్, శ్రీసత్యసాయి భజన మండలిసభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో సత్యసాయి గ్రామోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయవాడ చైతన్యకళాశాల సాంస్కృతోపాన్యాసకులు కందర్ప రాంబాబు మాస్టారు పాల్గొన్నారు. భక్తులతో సామూహిక గణపతి పూజ, స్ఫటిక లింగానికి అభిషేకాలు చేసి ప్రసాదాలు పంపిణీచేశారు. అనంతరం సత్యసాయి చిత్రపటాన్ని, పల్లకీలో బాబా పాదుకలు ఉంచి భజనలు చేస్తూ ఊరేగించారు. బిక్కిన వెంకట రామయ్య, సౌజన్య, గోలి మన్మోహనరావు, సూర్యకల్యాణి, కాకర్ల రామకృష్ణ భార్గవి, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఏలేశ్వరంలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తరువాత ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో 2004-06 విద్యా సంవత్సరంలో ఇంటర్‌మీడియట్ చదువుకున్న విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధ్యాపకులు పలివెల శివాజీ, సత్యగాంధీ, వాగు మాధవ్, విద్యార్థులు సత్యరామ్, పైల అయ్యప్ప, సుజాత, వరప్రసాద్, సీతారామ్, బంగార్రాజు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యపై అవగాహన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ విద్యపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన తరగతులు ఆదివారం హెచ్‌ఎం రాజేష్ ప్రారంభించారు. వృత్తి విద్యపై పది రోజులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ శిక్షణా తరగతులచేపట్టారు. అలాగే లంపకలోవ, పెద్దిపాలెం, ఉత్తరకంచి సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో కూడా ఒకేషనల్ విద్యపై అవగాహన కల్పిస్తున్నట్టు హెచ్‌ఎం రాజేష్ తెలిపారు.